క్లుప్తంగా

విత్తనాల దుకాణాలు తనిఖీ

పెద్దారవీడు: మండలంలోని హనుమాన్‌జంక్షన్ కుంటలో విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు మాట్లాడుతూ డీలర్లు కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని తెలిపారు. దళారులు లూజు విత్తనాలు అమ్మడానికి గ్రామాల్లోకి వస్తుంటారని, అలాంటి వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని చెప్పారు. అలాంటి వ్యక్తులు లూజు విత్తనాలు గ్రామాల్లో అమ్మినట్లు తెలిస్తే వెంటనే వ్యవసాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్, పెద్దారవీడు, మార్కాపురం వ్యవసాయాధికారులు కె.బుజ్జిబాయి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అనుమానితుల గృహాల ఆకస్మిక తనిఖీ


అనుమానితుడిని హెచ్చరిస్తున్న సీఐ ప్రభాకరరావు

యర్రగొండపాలెం: ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి పట్టణంలోని రౌడీ షీటర్లు, అనుమానితుల గృహాలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం వారి ప్రవర్తనపై ఆరా తీశారు. మంచి నడవడిక కలిగి ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య పాల్గొన్నారు.

విత్తన దుకాణం తనిఖీ


విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

త్రిపురాంతకం: గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి చెందిన అధికారులు స్థానిక లక్ష్మీ బాలాజీ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మకానికి పెట్టిన వివిధ కంపెనీలకు చెందిన పత్తి విత్తనాల నాణ్యత ప్రమాణాల పరీక్షలు నిర్వహించారు. ఆయా కంపెనీలకు చెందిన విత్తనాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించారు. తనిఖీల్లో వ్యవసాయ కమిషనర్ కార్యాలయ అధికారి బాలభాస్కర్, సహాయ వ్యవసాయ సంచాలకులు జి.మోహన్ కుమార్, టెక్నికల్ వ్యవసాయాధికారి వి.రమేష్, ఏవో కె.నీరజ పాల్గొన్నారు.

మృతదేహానికి రీపోస్టుమార్టం


రీపోస్టుమార్టం చేస్తున్న వైద్యులు, అధికారులు

దర్శి (కురిచేడు): మండలంలోని పెద్ద ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన నాగెండ్ల వెంకట్రావు మృతిపై అతని భార్య రమేళ ఫిర్యాదు మేరకు గురువారం రీ పోస్టుమార్టం చేశారు. వెంకట్రావు వరి పొలంలో నీరు కడుతూ అనుమానాస్పదంగా మృతి చెందాడు. వెంకట్రావు మృతిపై భార్య ఫిర్యాదు మేరకు గురువారం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మురళి, వీఆర్వోల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి రీపోస్టుమార్టం చేశారు.

సాయిబాబా మందిరంలో పూజలు


చట్లమిట్లలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు భక్తిశ్రద్ధలతో గురువారం పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.


భక్తులకు అన్నదానం

కొచ్చెర్లకోటకు సాగర్ నీరు బంద్

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

దొనకొండ:

మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీకి సాగర్ నీరు సరఫరా కాక 2 నెలలు కావస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు సమాచారం అందించినా స్పందించిన దాఖలాలు లేవని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రతాపం రోజు రోజుకూ ఎక్కువగా ఉందని, గ్రామాల్లో ఏర్పాటు చేసిన చేతి పంపులు మొరాయిస్తున్నాయని పేర్కొంటున్నారు. కొచ్చెర్లకోట పంచాయతీ పరిధిలో బసిరెడ్డిపల్లి, సిద్ధాయపాలెం, నారపురెడ్డిపల్లి, కట్టకిందపల్లి, పుల్లాయపల్లి, కొచ్చెర్లకోట ఎస్సీ కాలనీ గ్రామాలు ఉన్నాయి. సుమారు 7 వేల మంది జనాభా నివసిస్తున్నారు. సాగర్ నీరు రాక పోవడంతో చేతి పంపులోని నీరు తాగి వ్యాధులకు గురవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వారానికి 2, 3 రోజులకైనా సాగర్ నీరు వచ్చేది. సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు కొచ్చెర్లకోట పంచాయతీలోని గ్రామాలకు సాగర్ నీరు సరఫరా కావడం లేదని, తాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎక్కువ మంది వేసవి కాలంలో వలసలు వెళ్తుంటారు.

టీడీపీ నేతలే సాగర్ జలాలు నిలిపేశారు

అధికార పార్టీ నేతలే ఉద్దేశ పూర్వకంగా సాగర్ జలాలు నిలిపేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ పార్టీకి చెందిన నేతల ట్యాంకర్ల ద్వారా నీరు తోలి ప్రభుత్వ సొమ్ము సొంత ఖాతాలకు జమ చేసుకోవాలన్న కుట్రలో భాగంగా సాగర్ జలాలు నిలిపేసినట్లు ప్రచారం జరుగుతోంది. తమ పార్టీకి చెందిన వారికే నీరు సరఫరా చేసి వేరే పార్టీ వారికి నీరు సరఫరా కాకుండా అడ్డుకుంటున్నారని బసిరెడ్డిపల్లెకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆ గ్రామానికి చాలా రోజుల క్రితం పైపులైన్ వేశామని, మరమ్మతుల కారణంగా నీరు సరఫరా కావడం లేదన్నారు. గ్రామస్తులు విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో సాగర్ జలాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


బసిరెడ్డిపల్లెలో నీరు రాని ట్యాంక్

గతంలో సాగర్ నీరు సంపూర్ణంగా సరఫరా అయ్యేవి:



గతంలో మా ఊరికి సంపూర్ణంగా సాగర్ జలాలు సరఫరా అయ్యేవి. రెండు నెలల నుంచి నీరు సరఫరా కావడం లేదు. ట్యాంకర్ల ద్వారా వారికి నచ్చిన వారికే నీరు తోలుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. చేతి పంపులు మొరాయించాయి. సాగర్ జలాలు సరఫరా చేయాలి.

గొంగటి లక్ష్మిరెడ్డి, బసిరెడ్డిపల్లి

ఫ్లోరైడ్ నీరు తాగి వ్యాధులకు గురవుతున్నాం:



బసిరెడ్డిపల్లె వాసులు తాగేందుకు చుక్క నీరు లేవు. చేతి పంపులు మొరాయిస్తున్నాయి. ఫ్లోరైడ్ నీరు తాగి వ్యాధులకు గురవుతున్నారు. పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.

చాపా గాలెమ్మ, బసిరెడ్డిపల్లి

చేబ్రోలు కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేయాలి


త్రిపురాంతకం: పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


పెద్దదోర్నాల: పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌కు ఫిర్యాదు ఇస్తున్న నాయకులు

త్రిపురాంతకం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై యూ ట్యూబ్ ఇంటర్వ్యూలో అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్‌కుమార్, అతని టీమ్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం ఆధ్వర్యంలో పని చేసే ఐ టీడీపీకి చెందిన వీరు యూ ట్యూబ్‌లో ఇష్టానుసారం మాట్లాడటం తమందరిని కలచివేసిందని, తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని, గౌరవ ప్రతిష్టలకు భంగం వాటిల్లే విధంగా ఉందని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. యూ ట్యూబ్ ఇంటర్వ్యూలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కిరణ్‌కుమార్‌ను, అతడిని ఇంటర్వ్యూ చేసిన యాంకర్‌ను, ఆ వ్యాఖ్యలను ఎడిట్ చేసి యూ ట్యూబ్‌లో పోస్ట్ చేసిన వ్యక్తిని, యూ ట్యూబ్ చానల్ పాయింట్ బ్లాంగ్ (పీబీటీవీ) నిర్వహించే యజమానిని, ఈ వీడియోలను తయారు చేసేందుకు ఆర్థిక సహాయం అందించిన వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు సరళ కుమారి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు ఎస్.సుబ్బారావు, రంగబాబు, ఎం.మోహన్‌దాస్, మురారి గాలెయ్య యాదవ్, తాళ్ల శంబిరెడ్డి, ఎం.కోటి, మునలమ్మ, ఇందిర, బాలకోటిరెడ్డి, గురవయ్య, లింగయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దారవీడు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భార్య భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐ టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు వెన్నా శివకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌కు పార్టీ నాయకులు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భార్య భారతిపై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన కిరణ్‌కు కఠిన శిక్ష విధించాలని, మహిళలపై ఇలాంటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం చాలా దారుణమన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఏలూరి వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్, పార్టీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణ యాదవ్, ఎంపీటీసీ దూదేకుల పకీరయ్య, మాజీ సర్పంచ్ దుద్దెల వెంకటరెడ్డి, నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గోదాపు వెంకటేశ్వరరెడ్డి, ముడమంచు రాజారావు, గొట్టం వేణుగోపాలరెడ్డి, ఉప్పలపాటి పెద్దకాశయ్య, షేక్ బుజ్జి, పోటు గంగయ్య, తదితరులు ఉన్నారు.

పెద్దదోర్నాల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతిరెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన ఐటీడీపీ నేత చేబ్రోలు కిరణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా అసభ్య పదజాలంతో వాఖ్యలు చేయటం బాధాకరమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారిలో గుండారెడ్డి రమణారెడ్డి, వెన్నా బ్రహ్మానందరెడ్డి, పల్లా మల్లికార్జునరావు, జి.గాలిరెడ్డి, నాగేంద్ర, మాండ్ల వెంకటేశ్వర్లు, జి.శివారెడ్డి, రాజులు, లక్ష్మయ్య, చిన్నిబాబు, మొఘల్ న్యామత్ బేగ్, ఏసోబు ఉన్నారు.

పుల్లలచెరువు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు ఉడుముల అరుణమ్మ ఆధ్వర్యంలో ఎస్ఐ సంతప్‌కుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. వలంటీర్ల నియోజికవర్గ అధ్యక్షుడు వాసు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ప్రసాద్, సచివాలయ కన్వీనర్ దానియేలు, సిద్దెల సుబ్బమ్మ, నాయకులు కాశయ్య, హనుమంతురావు, అంజినాయక్, నాసరయ్య, నరసింహనాయక్, లక్ష్మానాయక్, రామాంజిరెడ్డి, చెన్నకేశవులు, అంజయ్య పాల్గొన్నారు.



పుల్లలచెరువు: ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


పెద్దారవీడు: ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కార్యకర్తలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


అలవలపాడులో కార్యకర్తకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


కాటంవారిపల్లెలో కార్యకర్త పున్నారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

కురిచేడు: పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన కార్యకర్త వీరగంధం వెంకట్రావును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. కాటంవారిపల్లె గ్రామానికి చెందిన కాటం పున్నారెడ్డిని బూచేపల్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఏ అవసరం వచ్చినా నేరుగా తమ ఇంటికి వచ్చి చెప్పుకోవచ్చని, అందుకోసం తమ ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ ఇంటలెక్చువల్ వింగ్ కన్వీనర్ వీరగంధం కోటయ్య, పంచాయతీరాజ్ వింగ్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ నిమ్మకాయల రాజయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, నాయకులు నుసుం ప్రతాప్‌రెడ్డి, ఆసుపల్లి చెన్నారెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాటం పెద్దిరెడ్డి, మోటాటి పుల్లారెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి, షేక్ మౌలాలీ, షేక్ కాశీం, అనుగొండ వెంకట నారాయణ, కోలా సంతోష్‌కుమార్, ఆంకె కృష్ణ, సారెడ్డి నాగిరెడ్డి, మువ్వా శ్రీనివాసులు, ఆంకె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుంటి గంగ తిరునాళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభ


ప్రభ ఏర్పాటుకు ఖాళీ స్థలంలో జెండా పాతిన వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల నాయకులు ప్రభ ఏర్పాటు కోసం గురువారం జెండా పాతారు. తొలుత గుంటి గంగమ్మ దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ చిమట సుబ్బారావు, పులి ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జక్కుల రామకృష్ణ, ప్రచార విభాగం అధ్యక్షుడు దత్తపు మధు, గుజ్జుల యోగిరెడ్డి, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి (గోల్డ్), అనిల్‌రెడ్డి, గోపు శ్రీనివాస్‌రెడ్డి, గుజ్జుల తిరుపతిరెడ్డి, పల్లెబోయిన శ్రీనివాసరెడ్డి, సయ్యద్ లతీఫ్, షేక్ వలి, పూనూరి దేవదానం, వేమర్తి ప్రభుదాస్, గూడా గోపాల్‌రెడ్డి, కుమ్మిత జయరామిరెడ్డి, సంగు కొండారెడ్డి, సయ్యద్ సైదా, పులి రమణారెడ్డి, వంకాయల బాలనాగిరెడ్డి, కోటా కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి


పెద్దారవీడు: గ్రామ సచివాలయాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కచ్చితంగా అందుబాటులో ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాన్పుల గది, ల్యాబ్, ఫార్మసీ గదులు, రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రతి సచివాలయంలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎన్‌సీడీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని, గర్భిణులను సకాలంలో గుర్తించి వైద్య సేవలు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. ప్రతి గర్భిణికి తప్పకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో కాన్పు అయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డాక్టర్ జగదీష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు హరినాథ్, సుభానీ, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన సుబ్బమ్మ


ఎంపీపీ సుబ్బమ్మను అభినందిస్తున్న ఎంపీటీసీలు, నాయకులు

త్రిపురాంతకం: ఎంపీపీగా ఆళ్ల సుబ్బమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో జరిగిన ఎంపీపీ ఉప ఎన్నికలో కూటమి నాయకులు చేసిన రాజకీయ కుట్రలను ఛేదించి ఆమె ఎంపీపీ పీఠాన్ని అధిష్టించారు. సుబ్బమ్మ భర్త, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల ఆంజనేయరెడ్డి ఎంపీపీ స్థానాన్ని కైవశం చేసుకుంటాడన్న భయంతో ఆయనపై తప్పుడు కేసులు నమోదు చేయించి రిమాండ్‌కు పంపారు. అయినా ఆమె పట్టువదలకుండా ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఇచ్చిన ధైర్యంతో ఎంపీపీగా పోటీ చేసి ప్రత్యర్థులను చిత్తు చేసింది. ప్రజలకు సేవ అందించేందుకు ముందుకొచ్చి బాధ్యతలు చేపట్టిన సుబ్బమ్మకు ఎంపీటీసీ సభ్యులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, సాయపనేని సుబ్బారావు, ఆళ్ల అంజలి, గుడిమెట్ల మునలయ్య, జినుకోటి ఇమ్మానియేలు, పాటిబండ్ల కృష్ణ, నాయకులు చిన్నకొండు పేరిరెడ్డి, మాలపాటి మోహన్‌దాస్, మురారి గాలెయ్య యాదవ్, ఆళ్ల రామయోగిరెడ్డిలు శాలువాలు కప్పి అభినందించారు.

వెలుగొండ ప్రాజెక్టు సాధనకు పోస్టుకార్డు ఉద్యమం


పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన నాయకులు

పుల్లలచెరువు: వెలుగొండ ప్రాజెక్టు సాధన కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో పోస్టుకార్డు ఉద్యమం సీపీఐ కార్యదర్శి గురునాథం నేతృత్వంలో చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ఆశాకిరణమైన వెలుగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం నిధులు కేటాయించి దానిలో భాగమైన తీగలేరు కాలువను పుల్లలచెరువు చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడగించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో తాగు, సాగు నీరు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రైతులంతా పోస్టుకార్డు ఉద్యమం ద్వారా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని, ప్రభుత్వం స్పందించకుంటే ఈ ప్రాంతం ఏడారిగా మారే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, మండల ఉపాధ్యక్షుడు ఎల్.రాములు, సర్పంచ్ ఓబులేసు, సీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు రామయ్య, ఎంపీటీసీ రాధకృష్ణ, నాయకులు పి.ప్రసాద్, శ్రీనివాసచారి పాల్గొన్నారు. అనంతరం పోస్టుకార్డులు పోస్టు చేశారు.

సంఘాల అవసరాలు గుర్తించాలి

ముండ్లమూరు (కురిచేడు): స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల అవసరాలు గుర్తించాలని వెలుగు ఏపీఎం హనుమంతురావు సూచించారు. మండలంలోని పూరిమెట్లలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏల ద్వారా ఎన్యుమరేటర్లు గ్రామాల్లో సర్వే చేపట్టి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు వారి అవసరాలు గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. సీసీ కోటేశ్వరరావు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం


ఐనముక్కల రథోత్సవానికి హాజరైన భక్తులు

పెద్దదోర్నాల: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఐనముక్కల, తిమ్మాపురాల్లో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల రథోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో 5 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం ఐనముక్కలలో వేంచేసిన శ్రీ సీతారాముల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛరణలు, సంప్రదాయ వాయిద్యాల సందడి నడుమ గ్రామ పెద్దలు ఊరేగింపు నిర్వహిస్తూ ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వైభవాన్ని కన్నులారా తిలకించేందుకు వచ్చిన ప్రజలతో ఐనముక్కల కిక్కిరిసింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి వేద పండితుల మధ్య ఆలయ రథాన్ని కదిలించారు. ఈ సందర్భంగా వేలాదిగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రముఖులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది.